ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ తనిఖీ

కొడిమ్యాల, అక్టోబర్ 7: పూడూర్ గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. పూడూర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నేషనల్ క్వాలిటీస్ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (NQAS) కి ఎంపికైన సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో నీటి నిల్వలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఇక్కడ మండల వైద్యాధికారి పరమేశ్వరి, సీహెచ్‌వో రాజశేఖర్, సూపర్‌వైజర్ వెంకట నర్సమ్మ, తదితరులు ఉన్నారు.

కోరుట్ల: లండన్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

లండన్‌లో చేనేత బతుకమ్మ వేడుకలు

కోరుట్ల, అక్టోబర్ 7: లండన్‌లో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో సోమవారం చేనేత బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలు చేర్చి ఆడిపాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృషితో చేనేత బతుకమ్మ– దసరా సంబురాలు ఏటా జరుపుకొంటున్నామని టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, తెలంగాణ ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కుర్మాచలం తెలిపారు. వేడుకలకు యూకే నలుమూలల నుంచి 2వేల మంది ప్రవాస భారతీయ కుటుంబాలు హాజరయ్యాయి. వేడుకల్లో హౌంస్లా మేయర్ కారెన్ స్మిత్, భారత సంతతికి చెందిన మాజీ ఎంపీ వీరేంద్రశర్మ, నిర్మల దంపతులు, భారత హైకమిషన్ ప్రతినిధి అజయ్‌కుమార్ ఠాకూర్, కౌన్సిలర్లు ప్రీతమ్ గ్రేవాల్, అజ్మీర్ గ్రేవాల్, ప్రభాకర్ ఖాజా, టాక్ ఉపాధ్యక్షులు శుష్మణరెడ్డి, సత్యమూర్తి చిలుమల, టాక్ ప్రధాన కార్యదర్శి సురేశ్ బుడగం, అడ్వయిజరీ బోర్డు చైర్మన్ మట్టారెడ్డి, పవిత్ర కంది, స్వాతి బుడగం, సుప్రజ పులుసు పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ సంబురాలు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 7: జగిత్యాల పద్మశాలీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మహా బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. సోమవారం పద్మశాలీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జగిత్యాలలోని అంగడిబజార్‌లో మంగళవారం నిర్వహించే బతుకమ్మ వేడుకలకు మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఇక్కడ సభ్యులు బాలే శోభారాణి, చెట్‌పెల్లి స్వప్న, వీరబత్తిని కృష్ణ, వాసం సునీత, శైలజ, మ్యాన సబరి, మంచాల జమున, సాంబారి కళావతి ఉన్నారు.

దరఖాస్తులు అందించాలి

సారంగాపూర్, అక్టోబర్7: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఓటరు నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత దరఖాస్తులను తహసీల్ కార్యాలయంలో అందజేయాలని తహసీల్దార్ ఎండీ జమీర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రి పూర్తి చేసినవారు, ఉపాధ్యాయ రంగంలో పని చేస్తున్న వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు.

మల్లాపూర్: రాఘవపేటలో ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: మల్లాపూర్‌లో బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న మహిళలు

జగిత్యాల: భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

పెగడపల్లి: ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్

ప్రత్యేక పూజలు..అన్నదానాలు

- కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రోత్సవాలు
- ఘనంగా బోనాల ఊరేగింపు

మారుతీనగర్: బోనాలతో ఊరేగింపుగా త్రిశక్తి ఆలయానికి వస్తున్న భక్తులు

కోరుట్ల/సారంగాపూర్/మేడిపల్లి/పెగడపల్లి/కొడిమ్యాల/కథలాపూర్/కోరుట్ల రూరల్/మారుతీనగర్/ఇబ్రహీంపట్నం/జగిత్యాల టౌన్, అక్టోబర్7: జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మహిళలు ఇంటికో బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య ఉరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. మండపాల్లో కుంకుమార్చనలు చేయగా, పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో మండపాల వద్ద అన్నదానం చేయగా, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మల్లాపూర్ మండలం రాఘవపేటలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు బోనాల వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలోని దుర్గామాత మండపం వద్ద అమ్మవారికి 108 రకాల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

స్కందమాత అలంకరణలో అమ్మవారు

ధర్మపురి, అక్టోబర్ 7: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో ఐదో సోమవారం అమ్మవారు స్కందమాత అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం వేళలో శ్రీ రామలింగేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులను నంది వాహనంపై ఉంచి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

ధర్మపురి: అమ్మవారికి హారతి ఇస్తున్న వేదపండితుడు

కథలాపూర్: గంభీర్‌పూర్‌లో దుర్గాదేవికి భక్తులు సమర్పించిన 108 రకాల నైవేద్యాలు

మారుతీనగర్: శాకాంబరీ అవతారంలో వాసవీమాత

కోరుట్ల రూరల్: ప్రత్యేక అలంకరణలో దుర్గామాత

కోరుట్ల: కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

కోరుట్ల రూరల్: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జువ్వాడి కృష్ణారావు

ఇబ్రహీంపట్నం: అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ పీ రాంబాబు
- ప్రజావాణిలో 25దరఖాస్తుల స్వీకరణ

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

జగిత్యాల రూరల్, అక్టోబర్7: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పీ రాంబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులను అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల) గౌతమ్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 25ఫిర్యాదులు వచ్చాయని, వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు. ఇక్కడ జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, పంచాయతీ అధికారి రఘువరణ్, అధికారులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కాపాడండి..

తాటిపల్లి గ్రామంలోని మాట సంఘం శ్మశానవాటికను అక్రమార్కుల నుంచి కాపాడాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికలో రాత్రి సమయంలో జేసీబీతో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నారని, అడ్డుకున్న వారిని జేసీబీ ఓనర్ బెదిరిస్తున్నారని తెలిపారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

మేడిపెల్లి మండలం వల్లంపల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఉందని, వరి ధాన్యం దిగుబడి అధికంగా ఉన్నందున ఐకెపీ ఆధ్వర్యంలో మరో సెంటర్ మంజూరు చేయాలని రైతులు వినతిపత్రం అందజేశారు.

కమిటీల ఏర్పాటుకు కలెక్టర్‌కు వినతి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గంగం జలజ

జగిత్యాల టౌన్, అక్టోబర్ 7: జిల్లాలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు సత్వరమే ఏర్పాటు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, కొందరు మహిళా ఉద్యోగులు వారిపై జరుగుతున్న వేధింపులను తమ సంఘం దృష్టికి తెచ్చారన్నారు. వెంటనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, బ్యాంకులు, కార్ఖానాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తే బీసీ మహిళా సంఘం తరపున ఆందోళనలు చేస్తామని ప్రకటించారు.

ఎలక్ట్రిక్ స్కూటీ ఇప్పించండి

జగిత్యాల రూరల్, అక్టోబర్7: ఎలక్ట్రిక్ స్కూటీ ఇప్పించండి సారూ.. అంటూ ఓ దివ్యాంగుడు సోమవారం ప్రజావాణిలో అధికారులను వేడుకున్నాడు. పెగడపల్లి మండలం మద్దులపల్లెకి చెందిన దివ్యాంగుడైన కడారి మనోజ్ జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. మంద్దులపల్లె నుంచి ఆర్టీసీ బస్సులో జగిత్యాలకు వచ్చి.. పాత బస్టాండ్ నుంచి ఆటోలో కళాశాలకు వెళ్తున్నాడు. కళాశాలకు వచ్చే సమయంలో ప్రయాణికులు కిక్కిరిసి ఉండడంతో ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉందని ఆవేదన చెందాడు. అధికారులు వెంటనే స్పందించి తనకు ఎలక్ట్రికల్ స్కూటీని ఇప్పించాలని వేడుకున్నాడు.

కడారి మనోజ్ దివ్యాంగుడు

అదనపు కలెక్టర్ వర్సెస్ కమిషనర్

జగిత్యాల రూరల్, అక్టోబర్ 7: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ప్రజావాణికి 12.50గంటలకు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య రావడంతో అదనపు కలెక్టర్ రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇంత లేటుగా వస్తే ఎట్లా? మీ శాఖకు సంబంధించిన దరఖాస్తులకు ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించగా, తానూ గ్రూప్–1 ఆఫీసర్‌నే అని సమ్మయ్య నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. మీరు బిజీ అయితే.. వేరే అధికారిని అయినా పంపించాలని అదనపు కలెక్టర్ అన్నారు. తాను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొని వచ్చేసరికి ఆలస్యమైందని కమిషనర్ సమాధానం ఇవ్వగా.. ముందస్తు ఎందుకు చెప్పలేదని అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి ప్రశ్నించారు. అధికారుల సాక్షిగా ఇద్దరు అధికారులు వాగ్వాదం చోటుచేసుకోవడం గమనార్హం.

మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్లు

వల్లంపల్లిలో ఐకేపీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తాటిపల్లి గ్రామంలోని శ్మశానవాటికను కాపాడాలని కోరుతున్న గ్రామస్తులు

చలిగల్ గ్రామంలో చోరీ

జగిత్యాల రూరల్, అక్టోబర్ 7: జగిత్యాల రూరల్ మండలం చలిగల్ గ్రామంలో ఆదివారం రాత్రి చింతలపెల్లి సతీశ్ ఇంట్లో చోరి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీశ్ తల్లి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో సతీశ్ ఇంటి పక్కనే ఉంటున్న వాళ్ల అక్క ఇంటిలో నిద్రిస్తున్నాడు. ఆదివారం రాత్రి దుండగులు సతీశ్ ఇంటి తాళాలు పగలగొట్టి.. ఇంట్లోని పది తులాల బంగారం, రూ,45వేలు ఎత్తుకెళ్లినట్టు బాధితుడు వాపోయాడు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

మల్లాపూర్, అక్టోబర్ 7: సిరిపూర్‌లోని సహకార సంఘం సమస్యలను పరిష్కరించాలని చైర్మన్ బద్ధం అంజిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ, తమ సంఘానికి అటాచ్‌గా అమ్మక్కపేటలో ఉన్న 3.11 ఎకరాల భూమి, గతంలో అక్రమాలకు పాల్పడిన పాత సీఈవోకు చెందిన వేంపేటలోని 1.20 ఎకరాల భూమిని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వేలం వేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇక్కడ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, రైతులు ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

- ఒకేచోట కలుసుకున్న చిన్ననాటి మిత్రులు
- గురువులకు ఆత్మీయ సన్మానం

పెగడపల్లి: విద్య నేర్పిన గురువులతో జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు

కోరుట్ల రూరల్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెగడపల్లి, అక్టోబర్ 7: మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల (1999–2000లో ఎస్సెస్సీ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రాంరెడ్డి, నాగేశ్వర్, శివానందం, లక్ష్మణ్‌ను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ఇక్కడ పూర్వ విద్యార్థులు వేణుగోపాల్‌రెడ్డి, లోకేశ్‌యాదవ్, గంగారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, తిరుపతి, యుగేంద్రాచారి, రాజు, దశరథం, ప్రియాంక, కళ, కృష్ణవేణి ఉన్నారు.

కోరుట్ల రూరల్, అక్టోబర్ 7: ఐలాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల (2005–26లో ఎస్సెస్సీ బ్యాచ్) సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి బాగోగులు తెలుసుకొని ఆటాపాటలతో సరదాగా గడిపారు. తర్వాత సహపంక్తి భోజనాలు చేశారు. అంతకుముందు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను వారు సన్మానించారు.

చేనుకు నీరు పెట్టేందుకు వెళ్లి..

- కరెంట్‌షాక్‌తో రైతు మృతి
- పండుగపూట బతికపల్లిలో విషాదం

పెగడపల్లి, అక్టోబర్ 7: వరి చేనుకు నీళ్లు పెట్టేందుకు వెళ్లి.. ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన బతికపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొమ్మెళ్ల అంజయ్య(53) రోజువారీ మాదిరిగా సోమవారం గ్రామ సమీపంలోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. చేనుకు నీరు పెట్టేందుకు మోటర్ ఆన్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ రవికిరణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అంజయ్య సోదరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కరెంట్‌షాక్‌తో అంజయ్య మృతి చెందడంతో గ్రామంలో పండుగపూట విషాదం నెలకొన్నది.

స్వయం ఉపాధి పొందాలి

- సెర్ప్ డీపీఎం వెంకటేశం

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 7: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని సెర్ప్ డీపీఎం వెంకటేశం తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చింతలపేటలో ఉత్కం పద్మ నెలకొల్పిన నాటుకోళ్ల పెంపకం యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. ఇక్కడ ఫామ్ ఏపీఎం హుస్సేన్, సెర్ప్ ఏపీఎం విమోచన, సీసీ సూరయ్య, వీవోఏ, వోబీలు, తదితరులు ఉన్నారు.

స్సారెస్పీ వరద కాలువలో

వృద్ధుడి మృతదేహం

కథలాపూర్, అక్టోబర్ 7: మండల కేంద్రం శివారులోని ఎస్సారెస్పీ వరద కాలువలో ఓ వృద్ధుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన రామగిరి నర్సయ్య(70) మృతదేహంగా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలాన్ని హెడ్‌కానిస్టేబుల్ మధుకర్, కానిస్టేబుల్ నవీన్ పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎమ్మెల్సీకి నాయకుల వినతి

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 7: మెట్‌పల్లి పట్టణంలోని ఖబ్రస్తాన్ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ మైనార్టీ నాయకులు సోమవారం ఎమ్మెల్సీ అమీర్‌అలీకి వినతి పత్రం సమర్పించా రు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఇక్కడ మహ్మద్ సోహైల్, షేక్ మహ్మద్, మహ్మద్ నయీమ్, మహ్మద్ అవేజ్, మహ్మద్ షమీ, తదితరులు ఉన్నారు.

పెగడపల్లిలో ప్రజావాణి

పెగడపల్లి, అక్టోబర్ 7: తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక్కడ ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, డీటీ రాజశేఖర్, ఆర్ఐలు శ్రీనివాస్, జమున, ఏపీఎం సమత, ఏపీవో అనిల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుబద్ర, తదితరులు ఉన్నారు.

350లీటర్ల మద్యం సీసాలు ధ్వంసం

మేడిపల్లి, అక్టోబర్ 7: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో మేడిపల్లి, భీమారం మండలాల్లో స్వాధీనం చేసుకున్న రూ.1.70లక్షల విలువైన 350లీటర్ల సీసాలను సోమవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ రాజమౌళి, ఎస్ఐ శ్యామ్‌రాజ్ ధ్వంసం చేశారు.

కార్యవర్గం ఎన్నిక

కొడిమ్యాల, అక్టోబర్ 7: పూడూర్ గ్రామంలో నల్లపోచమ్మ బాల హనుమాన్ సేవాదళ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వోల్లాల జగదీష్, ఉపాధ్యక్షుడిగా దాచిపల్లి మధురెడ్డి, కోశాధికారిగా దుమాల పర్శరాములు, ఉప కోశాధికారిగా గుండ్ల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది భరత్, కార్యదర్శులుగా గడ్డం ప్రశాంత్, కడారి మహేశ్, పొన్నం సాయి భగిరథ్, సంయుక్త కార్యదర్శిగా వడ్లకొండ శివ, సలహాదారులుగా వడ్లకొండ వెంకటరమణ, ఎడపల్లి సత్యం ఎన్నికయ్యారు.

క్రికెట్ విజేతగా కృష్ణంరాజు టీమ్

గెలుపొందిన కృష్ణంరాజు టీమ్

కొడిమ్యాల, అక్టోబర్ 7: మండల కేంద్రంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం రాత్రి విలేజ్ టూ విలేజ్ నైట్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన 20టీమ్‌లు పోటీలో పాల్గొన్నాయి. హిమ్మత్‌రావుపేట టీమ్‌పై కొడిమ్యాల కృష్ణంరాజు టీమ్ గెలుపొందింది. విజేత టీమ్‌కు కొడిమ్యాల ఎస్ఐ సందీప్ ట్రోఫీతోపాటు రూ.6వేల నగదు అందించారు. ఇక్క డ టీమ్ ప్లేయర్స్ కృష్ణంరాజు, బల్కం అనిల్, సాయి, నాగర్జున, నవీన్, నాగరాజు, నాగతల్వార్, ప్రమోద్, సల్మాన్, దీకొండ సంతోష్, తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

కోరుట్ల, అక్టోబర్ 7: పట్టణంలోని కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 11 నుంచి 13 వరకు హర్యానాలోని ఫరీదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆరుగురు విద్యార్థులు రిష్విక్, గితేష్, శశివర్ధన్, ధనుష్క, శరణ్య, మనోజ్ఞ ఎంపికైనట్లు కరస్పాండెంట్ గుజ్జెటి వెంకటేశ్ తెలిపారు. ఈ నెల 7 నుంచి రెండు రోజుల పాటు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తిలక్‌స్టేడియం నిర్వహించే జాతీయ స్థాయి శిక్షణకు విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

గొల్లపల్లి, అక్టోబర్ 7: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సోమవారం గొల్లపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్కు కరుణాకర్‌రెడ్డి ఆధ్యర్యంలో రేకుర్తి కంటి దవాఖాన చైర్మన్ లయన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ లయన్ చిదుల సురేశ్ సహకారంతో గొల్లపల్లి రెడ్డి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎస్ఐ సతీశ్ ప్రారంభించారు. శిబిరంలో రోగులకు బీపీ, షుగర్‌తోపాటు కంటి పరీక్షలు చేశారు. ఆపరేషన్ అవసరం ఉన్నవారి రేకుర్తి కంటి దవాఖానకు రెఫర్ చేశారు. ఇక్కడ ఆర్సీ తన్నీరు రాజేందర్, జడ్సీ రామకృష్ణ, గొల్లపల్లి క్లబ్ ప్రధాన కార్యదర్శి సాయిని నరహరి, కోశాధికారి సాతల్ల సత్యనారాయణ, సభ్యులు చంద్రశేఖర్, వెంకటరమణ, రాజన్న, రమేశ్, అశోక్‌రావు, సత్యనారాయణ, కిషన్, సురేశ్, తదితరులు ఉన్నారు.

గొల్లపల్లి కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎస్ఐ సతీశ్